# చరితార్ధులు.

రచన :
శ్రీ. ఎన్. లక్ష్మీనారాయణ, బి.ఏ.

నీలాంబరంమీద మిణుకు మిణుకుమంటున్న తారలను లెక్కట్టుతున్నట్టు, పక్కమీద వెల్లకిలా పడుకుని ఆకాశంవంక తదేకంగా చూస్తున్నాడు రాంబాబు: నిజానికి అతను చుక్కలను లెక్కట్టే ప్రయత్నంలో లేడు: కానీ ఆలోచిస్తున్నాడు. ఆనాటి మధ్యాహ్నం జరిగిన సంఘటన...కాదు. ఘర్షణనుగూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు; తనను కని, పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించిన కన్నతండ్రితో ఘర్షణపడ్డాడు; ఘర్షణపడకుండా సమస్యా పరిష్కారానికి మార్గం ఏర్పరచుకోవాలనుకున్నాడు; కానీ అనివార్యమైంది; తన వివాహ విషయం ఇంట్లో ఇల్లాంటి తుఫానును సృష్టిస్తుందని తాను కలలో కూడ ఊహించలేదు; పుట్టగానే తల్లిని పొట్టబెట్టుకున్న తనను క్రింద దించకుండా భుజాలమీద మోసి, తల్లిలేని లోటు తీర్చాడు తన తండ్రి; నిజమే! అంతమాత్రాన తన పెళ్ళి విషయంలో తండ్రిగారికి అంత అధికారమేమిటి! తన పెళ్ళి విషయంలో ఒక నిర్ణయానికి వచ్చే హక్కు, స్వేచ్ఛ తనకు లేదా? ఆ బాధ్యత కొంతైనా తనమీద లేదా; తన నిర్ణయాలతో బొత్తిగా పనిలేదా! పెద్దలు నిశ్చయించే వివాహాలకు ఎదురులేదన్నట్టు అంగీకరించాల్సిందేనా? ప్రేమించటం తప్పా! 'పెళ్ళి'కి 'ప్రేమ' యన్నది ప్రధానంకానీ హోదాలు, అంతస్థులు కావు. ప్రేమలేని జీవితాలు చంద్రుడులేని రాత్రుల్లాగ చీకటిమయంగా పరిణమిస్తాయనే విషయాన్ని వారు గ్రహించలేరా?

తాను స్వర్ణను ప్రేమించాడు; ఏదో సంబంధం విషయం ప్రస్తావనకు వస్తే, తనకు ఆ సంబంధం ఇష్టం లేదనీ, తాను స్వర్ణను ప్రేమించాననీ, తండ్రిగారితో విన్నవించుకున్నాడు. అంతే! జమీందారుగారూ, కొడుకు చేసినపని తప్పన్నట్టు అగ్గిమీద గుగ్గిలంలా భగ్గుమన్నారు.

'నా సర్వస్వం నీవేనని, నా వంశాన్ని ఉద్ధరిస్తావని నీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నా! ఈనాడు నా ఆశలను కొకటి వ్రేళ్ళతో పెల్లగిస్తావట్రా; కయ్యమైనా, వియ్యమైనా సమానమైనవాళ్ళతోనే జరగాలన్నారు! కానీ అందుకు భిన్నంగా జరిగితే జీవితంలో ఎప్పటికీ ఆగని గాలివానలు చెలరేగటం తప్పదు!

ఆ పిల్ల భోగం జాతిది; వాళ్ళ పూర్వీకులు పదిమంది ముందు నిల్చుని తైతక్కలాడారు; ఆపిల్లనట్రా నీవు ప్రేమించి వరించేది! అల్లాంటి నీచజాతి పిల్లను చేసుకుంటే మన జమీందారీ పరువు ప్రతిష్ఠలు మట్టిలో కొట్టుకుపోవూ? కాలేజి చదువులు చదివి ఆర్జించిన విజ్ఞానంతో నీవు చేసే ఘనకార్యం ఇదేనట్రా! ఎంత దౌర్భాగ్యానికి దిగజారావురా? ఛీ నా కడుపున చెడబుట్టావ్!' అని మందలించాడు. ఆ మందలింపు వెనుక దాక్కున్న తండ్రిగారి హృదయంలోని వ్యధ తనకు అర్ధంకాకపోలేదు. కానీ తన మూగబాధ తండ్రిగారికి ఎల్లా తెలుస్తుంది? తన ఆవేదనను తండ్రిగారు ఎల్లా అర్ధంచేసుకుంటారు? తన కోర్కెను వారు ఎల్లా మన్నించగలుగుతారు స్వర్ణ ఏ దోషమూ ఎరుగని అమాయకురాలు; ఎంత సహృదయం ఆమెది? నాన్నగారి దూషణలు వింటే నవనీతంలాంటి ఆమె హృదయం ఎంత సంక్షోభానికి గురియవుతుందో? ఆమె మనస్సులో ఎటువంటి మంటలు రగుల్కొంటాయో? ఐనా చివరిదాకా తండ్రిగారికి నచ్చచెప్పటానికి తాను శాయశక్తులా కృషి చేశాడు.

'నాన్నగారూ! ఏనాడో వారి పూర్వీకులు కాళ్ళకు గజ్జెలు కట్టారని ఈనాడు ఏపాపమూ ఎరుగని స్వర్ణను శిక్షించటం న్యాయమేనంటారా? స్వర్ణ అభం, శుభం, ఎరుగని అమ్మాయి; అందవతి; గుణవతి; ఆమెను మీ కోడలిగా స్వీకరిస్తే మన జమీందారీ వంశ ప్రతిష్ఠలు పెరుగుతాయికానీ ఏమాత్రం తరగవు; ఈ విషయంలో మీ అభిమతానికి విరుద్ధంగా ప్రవర్తించాలనికాదు కానీ, ప్రస్తుతం మీ ముందు ఏకరువుపెట్టిన విషయాలను ఒక్కమారు పరిశీలించండి; బాగా ఆలోచించండి' అని తాను అర్ధించాడు.

'బాబూ! ఇంత స్వల్ప విషయాన్నిగూర్చి ఆట్టే ఆలోచించే వ్యవధి నాకు లేదు. జీవితంలో అడుగడుగునా ఇల్లాంటి అల్ప విషయాలకు ప్రాముఖ్యతనిస్తే మన జమీందారీ పరువు ప్రతిష్ఠలు కాలగర్భంలో కలిసిపోవ

టానికి ఎంతో కాలం పట్టదు. ఉన్న విషయాలనుగూర్చి బాగా ఆలోచించే ఈమాటలు చెబుతున్నాను. నీవంటున్న ఆ అమ్మాయి అందవతికావచ్చు; గుణవతి అంతకంటే కావచ్చు; అంతమాత్రాన వంశ ఆచారాలు ఎక్కడికి పోతాయి...! మారిన కాలాన్నిబట్టి, మారుతున్న పరిస్థితులకొద్దీ, మన స్తత్వాల్లోకూడ మార్పు అనేది తొంగిచూడవచ్చు. కానీ అనాదిగ సంక్రమించే సాంప్రదాయాల సంపర్కం సమసిపోతుందా? పన్నీరు పోసి పెంచినా పుల్లకి మల్లెల గంధం ఏర్పడుతుందా? అదంతా మన వెర్రి. కేవలం భ్రమ. 'పుర్రెకొక బుద్ధి, జిహ్వకొక రుచి' యన్నట్టు ఒక్కొక్కరి ఆలోచనలకు ఒక్కొక్కరి అభిరుచులకుమధ్య లోతైన అగాధాలుంటాయి. ఏసమస్యనైనా తార్కికంగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావటమనేది ప్రతి మానవుడు తన ప్రథమ కర్తవ్యంగా భావించాలి. అందుకు కాదనేవారు కాలప్రవాహంలో ఎదురీత నీదాల్సొస్తుంది; అనుభవజ్ఞుణ్ణి. భావిలో నీ శ్రేయస్సును కోరేవాణ్ణి. ఆలోచించి చెబుతున్నా! ఆ అమ్మాయిని మరచి ఈ సంబంధానికి ఒప్పుకో!'

“నాన్నగారూ! ఒక్కగానొక్క కొడుకుననే మమతకొద్దీ నన్ను ఎంతో గారాభంగా పెంచి తల్లిలేని కొరతను తీర్చారు. మీ కుమారుడు తప్పు చేశాడనే అనుకోండి, కానీ పిన్నలుచేసిన తప్పులను ఒప్పులుగా భావించి మన్నించటమనేది పెద్దల కర్తవ్యం, ఇటువంటి విషయాల్లో నేను మీకు చెప్పేటంతటి వాణ్ని కాను, కానీ నేను చేసిన ఈ చిన్న తప్పును మన్నించి ఉభయులను ఒక ఇంటి వారినిచేసి ఆశీర్వదించండి' అని వేడుకున్నాడు.

'బాబూ! తెలియకచేసే తప్పులకంటే, తెలిసిచేసే తప్పులు చాల ప్రమాదమైనవి. తెలియక చేసే తప్పులు మన్నింపబడుతాయి, కానీ తెలిసిచేసే వాటికి శిక్షలు అనుభవింపక తప్పదు. పిన్నలు చేసే తప్పుల్ని సరిదిద్దే బాధ్యత పెద్దల మీద ఉంటుంది కనుక నే ఆ అమ్మాయిని మరచిపొమ్మని చెబుతున్నా! పది కాలాలపాటు జమీందారీ పరువు ప్రతిష్ఠలను నిలుపమంటున్నా! అల్లావీలు కాదంటే విషమించబోయే పరిస్థితులకు నీవు తల ఒగ్గక తప్పదు. ఇక వెళ్లు ఇప్పటికే చాలా ఆలస్యమైంది, భోజనంచేసి పడుకో!'

అంతే! ఘర్షణ ముగిసింది, తుఫాను వెలిశాక ప్రశాంత ఏర్పడేటు, ఘర్షణ అంతమయ్యాక వాతావరణంలో ఉద్రిక్త తగ్గుముఖం పట్టి ప్రశాంతత ఏర్పడింది

“సిన్నబాబుగారూ! భోజనంచెయ్యకుండా ఏవిటూ ఆలోచన్లు, లేవండి, భోజనానికి' అన్న రాజన్న పలుకులతో రాంబాబు ఆలోచనలు పటాపంచలయ్యాయి

'అక్కర్లేదు రాజన్నా! తీసికెళ్ళు, రాంబాబు పలకాడు బాధగా.

'అదేంటి బాబుగోరూ! భోజనం సయ్యకుండా పడుకుంటే పెద బాబుగోరు నా మీద కోప్పడతారు, కాసింత ఎంగిలి పడండి!”

'రాజన్నా! నీక్కాదూ చేప్పేది, అక్కర్లేదన్నాక తీసికెళ్ళు.”

రాంబాబు కేకతో రాజన్న పాలగ్లాసు అక్కడే వదలి భోజనం తీసుకుని మేడదిగివెళ్ళి పోయ్యాడు భోజనం లేకపోతే కనీసం పాలైనా త్రాగి పడుకుంటాడని రాజన్నకు తెలుసు. రాజన్న వెళ్ళిపోయ్యాక, రాంబాబు బాధతో గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. కానీ మస్తిష్కంలోని ఆలోచనల తీవ్రపోరాంవల్ల అతని కనురెప్పలు మూతలు బడలేదు. మళ్ళీ ఆలోచనల్లో బడ్డాడు.

'తండ్రిగారిని ఒప్పించి తాను స్వర్ణను వివాహ మాడతానని ప్రమాణంచేసాడు. స్వర్ణ తనమీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. స్వర్ణ తన ఐశ్వర్యాన్ని కరించలేదు. కానీ తన హృదయంలో కొంత చోటును అభిలషించి అర్థించింది. ఆమె ఆశలను ఫలప్రథం చేయటానికి తాను అంగీకరించాడు. పేదరాలైన, ఆమె జీవితాన్ని ఉద్ధరించటానికి తాను సంకల్పించుకున్నాడు. తీరా తండ్రిగారిని సమీపించేసరికి ఆ ఆశయాలు కాస్త ఎడారిపువ్వుల్లా నిర్జీవ ప్రపంచంలోనికి త్రోసి వేయబడ్డాయి. ఎంతో నిర్దాక్షిణ్యంగా.

తాను స్వర్ణకు ఏమని సమాధానం చెప్పాలి! రేపు ఆమెతన ముఖం చూచీ చూడ్డంతోటే “రామూ, మన పెళ్ళి విషయం ఏమైంది, మీనాన్న గారితో మాటాడావా? ఇంతకీ కాయా? పండా?' అని ప్రశ్నలవర్షం

(తరువాయి 55వ పేజీలో)

(22వ పేజీ తరువాయి)

కరిపిస్తుంది. తాను ఏమని చెబుతాడు, తననోరారా 'స్వర్ణా! మనకోర్కెలు ఫలించాయి, నాన్నగారు మన వివాహానికి అంగీకరించారు.' అన్న రెండు ముక్కలు ఆమె సమీపంలో వల్లించేభాగ్యానికి నోచుకోనపుడు ఆమెకు తానిచ్చే జవాబేమిటి?

ఒకవేళ 'నాన్నగారు మనపెళ్ళికి ఒప్పుకోలేదు, స్వర్ణా' అని పలికితే ఆమె ఎలాంటిస్థితికి గురియవుతుందో, తాను ఊహించగలడా? తాను ఆమె వద్ద వల్లించిన ఆశయాల మాటేమిటి...? తన ఆశయాలకు సంకెళ్ళు పడటమంటె, ఆమె ఆశాసౌధాలు పునాదులతో సహా కూలిపోవటమే! అటువంటప్పుడు ఆమెకు తన ముఖం ఎలా చూపటం? ఏదిదారి?' ఆకాశంలో క్రమంగా మబ్బులు తొలగి విశాల విశ్వంమీదికి వెలుగు కిరణాలు ప్రసారమైనట్లే, ఆలోచనలు క్రమంగా తగ్గి అతనిమనస్సును ప్రశాంతత ఆవహించింది. మగత నిద్రలో పడి, జలజలరాలి చెంపలమీదుగ ప్రవహించె కన్నీటిని తరచూతుడిచివేస్తూ, కొంత సమయానికి రాంబాబు గాఢ నిద్రలో పడిపోయ్యాడు. వారి ఆలోచనలతో తనకేమీ ప్రమేయం లేదన్నట్టు, గోడగడియారం ముల్లులు తమంతట తాము నడచిపోజొచ్చాయి.

ఉదయం రాంబాబు పక్కమీదినుండి లేచేసరికి తొమ్మిది గంటలు దాటింది. అతని కళ్ళుబాగా ఎఱ్ఱబారాయి. రాత్రి భోజనం లేకపోవటం వల్లనేమో ఆకలి కడుపులోని ప్రేవుల్ని నిలువునా దహించి వేస్తోంది. తూలుతూ లేచివెళ్ళి నిలువుటద్దం ముందు నిల్చుని, చెదరిన తల వెంట్రుకలను దువ్వుకొని బాత్‌రూమ్ వైపు నడకసాగించాడు. స్నానం ముగించివచ్చే సరికి రాజన్న ఫలహారం సిద్ధంచేసి బాబూ, పెదబాబుగోరు ఉదయం సిరిపురం వెళ్ళారు, సాయంత్రం వస్తానని మీతో చెప్పమన్నారు' అని అన్నాడు రాజన్న.

''సరే'' నన్నాడు రాంబాబు. టిఫన్ ముగిశాక రాంబాబు రేడియో స్విచ్ ఆన్‌చేసి కుర్చీలో కూచున్నాడు.

''నిన్నటి రోజు తాను పార్కు కెళ్ళకపోవటం వల్ల స్వర్ణతనకోసం దీపాలు వెలిగేవరకు ఎదురుచూచి, బహుశా తనపై కోపగించి వెళ్ళుంటుంది, అహం స్వర్ణ అల్లాంటి దికాదు; తానేదో తొందరలో మునిగిఉన్నట్టు భావించి వెళ్ళి పోయుంటుంది.' అనిపిచ్చిగ ఆలోచించాడు. కొంతసేపటికి వినుగేయటంవల్ల రేడియో స్విచ్ ఆఫ్‌చేసి, పియానోముందు కూచున్నాడు. కొంత సేపటికి అక్కడ అపస్వరాలు వినిపించటంవల్ల అక్కడ నుండి లేచి డ్రస్‌మార్చి పార్కు గుండాక్లబ్బుకు దారితీశాడు పార్కులో స్వర్ణ ఏమైనా అగుపిస్తుందేమోనని. పార్కులో స్వర్ణ అగుపించక పోవటంవల్ల, ఆమె ఇంటివద్ద కెళ్ళాలనుకున్నాడు, కాని సాయంత్రం ఎల్లాగూ పార్కుకు వస్తుందనే ఊహతో తిన్నగా క్లబ్బుచేరుకున్నాడు.

రోజుకు మల్లే ఆరోజుసాయంత్రమూ స్వర్ణ పార్కులో ఏకాంతంగా కూచుని ఏదో ఆలోచిస్తోంది. అప్పటికింకా నీరెండఉన్న భాస్కరుడు అలసిపోయి విశ్రాంతి తీసుకోటాని కన్నట్టు పశ్చిమదిశన పరుగుతీస్తున్నాడు. అడుగులో అడుగు వేసుకుంటూ రాంబాబు నెమ్మదిగా స్వర్ణను సమీపించి ఆమె వెనుకనే కూచుని చిన్నగా పొడిదగ్గు దగ్గాడు. స్వర్ణ ఉలికిపడి వెనుదిరిగి చూచి ఆనందానందాలతో ''రామూ'' అని అతని భుజంమీద వాలింది. ప్రవాహంలో సుమల్లా ఆమె కళ్ళలో నీటి బిందువులు గిర్రున తిరిగాయి. స్పష్టంగా అగుపించిన ఆ ఆనందభాష్పాలు అతనిహృదయానికి సుత్తి పోట్లుగ పరిణమించాయి. 'ఎందుకాభయం!' అని అభయమిస్తున్నట్లు ఆమెగడ్డాన్ని తనముని వ్రేళ్ళతో లేవనెత్తి కన్నీరు కాస్త తుడిచాడు.

''రామూ, మనపెళ్ళి సంగతి నాన్నగారికి తెలియచేశావా! వారేమన్నారు?' ఉన్నట్లుండి స్వర్ణ ప్రశ్నించింది. రాంబాబు గతుక్కు మన్నాడు. ఇంత త్వరగా ఆమెనుండి అటువంటి ప్రశ్నవస్తుందని అతను ఊహించలేదు.

'ఇంకా ఏమీ తెలుపలేదు స్వర్ణా! వీలు చూచుకొని మా నాన్నగారికి తెలియజేస్తా! వారేమీ అభ్యంతరం చెప్పరు. మనపెళ్ళి విషయంలో నీకే బెడదా అక్కర్లేదు, అని ధైర్యంచెప్పాడు. రాంబాబు తన హృదయంలో నలుమూలల నుండి చెలరేగిన ఒకవిధమైన

ఆందోళనను అణచివేస్తూ, ఈ సమాధానంతో సంతృప్తి చెందటంవల్లనేమో స్వర్ణ అతని చేతుల్లో వాలికను రెప్పలు మూసింది. రాంబాబు హృదయంలో ఒకవంక సంతృప్తి, మరో వంక అసంతృప్తి, ఒకవైపు ఆనందం మరోవైపు విచారం, ఒకదిక్కు సంతోషం, మరో దిక్కు విషాదం, ద్వంద్వయుద్ధం ప్రారంభించాయి. కబుర్లతో కొంత సమయంగడిచాక ఇద్దరూ లేచి తమ తమ ఇళ్ళవైపు దారితీశారు.

ఇంట్లో అడుగిడుతుండగానే 'బాబూ, ఇల్లారా!' అని కేకేశాడు సిరిపురంనుండి అప్పుడే తిరిగివచ్చిన జమీందారుగారు;

'ఏమిటి నాన్నా!' అంటూ తండ్రివద్దకొచ్చాడు రాంబాబు.

'ఏమీలేదు. ఆరోజు నీవు సిరిపురం, అమ్మాయిని చూచావుగా, ఆ సంబంధం నిశ్చయించుకొనివచ్చాను. ముహూర్తానికి పదిరోజుల వ్యవధి ఉంది ఈరోజునుండి పెళ్ళి సన్నాహాలు జోరుగా సాగితేకానీ ఏర్పాట్లు బ్రహ్మాండంగా రూపొందటానికీ అవకాశాలుండవు' చెప్పటం ఆపారు జమీందారుగారు.

ఈ వార్త వినటంతో రాంబాబు నెత్తిన పిడుగు పడ్డట్లైంది. 'నాన్నగారూ! ఈ సంబంధం నాకు ఇష్టం లేదని మీతో ఇదివరకే మనవిచేసుకొన్నా. కానీ ఒకే మారు ఖాయపర్చుకుని వచ్చారు జరిగిపోయినదానిమీద వ్యాఖ్యానించటం ఏవిధంగానూ ప్రయోజనకరమనిపించదు. మీ ఇష్టం' అని పలికాడు రాంబాబు. అతని కడుపులో ఎవరో చేతులుపెట్టి ప్రేవులు కదిల్చినట్టయింది. శిరోవేదన అధికమై భూమి గుండ్రంగా తిరుగుతున్నట్లనిపించింది. నెమ్మదిగా, భారంగా మెట్లెక్కి మేడమీదికి వెళ్ళిపోయ్యాడు. 'తన ఆశయం నెరవేరిందన్నట్టు' జమీందారుగారు పెదవులమీద చిరునవ్వును తొణికిసలాడించారు.

కాలవాహినిలో వారంరోజులు బరువుగా దొర్లిపోయ్యాయి. ముహూర్తానికి కేవలం మూడురోజులుంటంవల్ల ఒకవైపు పెళ్ళి ప్రయత్నాలు చకచకా సాగిపోతున్నాయి. మరోవైపు తీవ్రమైన మానసిక ఆందోళనతో కుమిలిపోతూ రాంబాబు పీలవంగా తయారయ్యాడు. క్షణక్షణాన, స్వర్ణ ఎల్లా ఉందో, తాను అగుపించకపోవటంవల్ల ఎంత మథనపడుతోందో, ఎంత తపిస్తోందో, తమ పెళ్ళి విషయం తాలూకు సువార్త వినటానికి ఎంత తహతహలాడుతోందోనన్న, అంశాలను గూర్చి ఆలోచించటంలోనే అతను కాలాన్ని వినియోగింపసాగాడు ఇల్లంతా బంధువులతో కోలాహలంగా ఉంది.

ఆరోజు సాయంత్రం కుర్చీలో కూచుని పరధ్యాన్నంగా ఉన్న రాంబాబు దగ్గరికొచ్చి 'సినబాబుగోరూ, స్వర్ణమ్మగోరు మీకియ్యమని ఈ ఉత్తరం ఇచ్చారు' అని అంటూ ఆటూ ఇటూ చూచి మొలనుండీ రాజన్న ఒక ఉత్తరం బయటికితీసి ముందుకు చాచాడు.

'ఆ, స్వర్ణ ఉత్తరం ఇచ్చిందా!' అంటూ చివాలున తీసుకొనిలేచి తన గదిలోనికెళ్ళి తలుపులు వేసుకున్నాడు. ఉత్తరం విప్పి చదివాడు.

'ప్రియమైన రాముకు—

వారం రోజులపాటు మీదర్శనభాగ్యం కరువయ్యేసరికి విషయమేమిటో బోధపడక, సాహసించి నిన్నటి రోజు మీ ఇంటి ఆవరణలో అడుగెట్టాను. నేనెవరో తెలుసుకున్నాక మీ నాన్నగారు నన్ను చడామడాయని నోటికివచ్చినట్టు దూషించారు.' నీకు డబ్బుకావాలంటే ఎంతైనా ఇస్తాను, కానీ మా వాణ్ణి మరచిపో, మావంశ గౌరవం కాపాడు, నీవు మా వాణ్ణి నిజంగా ప్రేమించి ఉంటే ఈ మాత్రం త్యాగం చెయ్యి," అని బ్రతిమలాడాడు. మీ వివాహం మరో అమ్మాయితో ఖాయమైనందుకు నేను బాధపడటంలేదు. మీ నాన్నగారు నన్ను దూషించినందుకు నేను ఏమాత్రం ఖేదపడటం లేదు, కానీ మిమ్మల్ని ఒక్కమారు చూట్టానికి మీ నాన్నగారు అనుమతించనందుకు నేనెంతో కుమిలిపోతున్నాను. మన పెళ్ళికి ఏ అభ్యంతరమూ ఉండదనీ, మీ నాన్నగారు తప్పక అంగీకరిస్తారనీ, మీరు నాతో చెప్పారు, చేసిన ప్రమాణాలను బట్టి మీరునన్ను తప్పక చేరదీసి ఆదరిస్తారని ఆశించాను. కానీ నా ఆశలు ఇల్లా అడియాశలై ఎండిన మోడుల్లా తయారవుతాయని అనుకోలేదు. మీ ఐశ్వర్యాన్ని పొందాలని, సకల భోగాలూ అనుభవించాలనీ నేను మిమ్మల్ని ప్రేమించలేదు. కానీ మహోన్నత ఆదర్శాలు, ఉదాత్త ఆశయాలుగల మీహృదయాన్ని

(తరువాయి 62వ పేజీలో)

(56వ పేజీ తరువాయి)

అర్థంచేసుకొని అందులో కొంత చోటివ్వమని అర్థించాను, అందుకు మీరూ ప్రయత్నించారు, కానీ మీ ప్రయత్నం మీద విధిదెబ్బ తీసింది. మనమొకటి తలిస్తే దైవ మరొకటితల్చింది. అందులో మీ తప్పిదమేమీ లేదు, అదికేవలం నా దురదృష్టం, మిమ్మల్ని వివాహమాడి మనచుట్టూ ఒక విధమైన చరిత్రను సృష్టించుకోవాలని తాపత్రయ పడ్డాను. కానీ చరిత్ర హీనురాలిని కావాలొచ్చింది. ఈనాడు మన ప్రేమ విఫలమైందంటే ఇది కేవలం ఐశ్వర్యానికి—పేదరికానికి గల నిరంతర సంఘర్షణ ఫలితమేనని నా భావన. మీకు ఈ ఉత్తరం అందేలోగా నేను ఈ లోకానికి దూరమై యుంటాను. ఈ జన్మలో కాకాపోతే వచ్చే జన్మలోనైనా మన వివాహానికి భగవంతుని ఆశీర్వాదం లభిస్తుందని నా విశ్వాసం మీ క్షేమమే నా క్షేమం, శెలవ్ !

ఇట్లు
మీ 'స్వర్ణ'

"స్వర్ణా" అని గట్టిగా అరిచాడు రాంబాబు. అతని హృదయం కల్లోల కదలిలా హోరుమని ఘోషించటం ప్రారంభించింది.

"స్వర్ణా ! నీవన్నట్టు ఐశ్వర్యానికీ, పేదరికానికీ మధ్యగల సంఘర్షణ ఫలితమే మన ఎడబాటుకు కారణమైంది, నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు, నేనూ నీవద్దకే వస్తాను, నీ వద్దకే వస్తున్నాను." అని అన్నాడు గది తలుపులు మూసుకున్నాయి. కొంత సమయం గడచింది. దీపాలు వెలిగాయి, రాంబాబును భోజనానికి పిలవటానికి మేడమీది హాలులోనికి వచ్చాడు రాజన్న. చినబాబు అక్కడ అగుపించక పోవటంవల్ల అతని గది తలుపులు త్రోసి లోనికెళ్ళాడు. వెంటనే కెవ్వుమని కేక వేసి బయటికి వచ్చాడు, పరుగెత్తుక వెళ్ళి బాబుగోరూ, బాబుగోరూ, సినబాబుగారు కళ్ళు తేలవేసి కుర్చీలో పడియున్నారు, వారివాలకం సూస్తే చాల భయమేస్తుంది' అని జమీందారుగారితో చెప్పాడు. 'ఆ' అంటూ కంగారుగా జమీందారుగారు డాక్టర్‌కు కబురంపి మేడమీదికెళ్ళాడు. 'బాబూ! బాబూ' అని చెయ్యిపట్టుకు పిలిచాడు. జవాబు రాలేదు. చేతులు చల్లగా ఉన్నాయి. జమీందారుగారి గుండె జల్లుమంది. డాక్టర్ శవాన్ని పరీక్షించి మరణించాడని చెప్పాడు. కొడుకు శవంపైబడి జమీందారుగారు చంటిపిల్లాడికిమల్లే భోరున విలపించాడు. బంధువులంతా శోక సాగరంలో మునిగిపొయ్యారు.

రాంబాబు అంత్యక్రియలు జరిగిన మూడురోజులకు, స్వర్ణ ఇంటివద్దనున్న బావిలో ఆమె శవం తేలింది. స్వర్ణ తలిదండ్రులు కంటికి మింటికి ఏకధారగా ఏడ్చారు. 'గొప్పోళ్ల సాంగత్యం పనికిరాదంటే విన్నావు కావమ్మా!' అని శవంమీదబడి విలపించారు.

స్వర్ణ, రాంబాబుల, పవిత్ర ప్రేమ విషాదాంతంగా పరిణమించినా, ఆదర్శ ప్రేమకు వారు ప్రతినిధులని ప్రజలచేత ప్రశంసింపబడ్డారు. వారి ప్రేమ చరితార్థం, వారు చరితార్థులే మరి.

## 'పుట్టిన రోజు'

రచన 'పుష్యమి'

*

నీ పుట్టిన రోజు నేడు!
చేపట్టిన దారిలో నడు!!
నీ ఆశయములకు తోడు!?
నే వచ్చెద స్వాగతమిడు!!
కథలతోడ అంజలిడే!!
'కథాంజలి' కదలినది నేడే!!
పలుకరించి పాట పాడె!!
నవ్విస్తూ నాట్యమాడె!!!
రచయితలకు ఉత్సాహం!
పాఠకులదె ప్రోత్సాహం!!
చేసె నందరి సమ్మోహం!!!
అదే 'కథాంజలి' వ్యూహం!!!
విడువకుమా నీదీక్ష
అదే నా శుభాకాంక్ష.